క్లుప్తంగా

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నేడు ప్రారంభం

కొవ్వూరు: పట్టణంలో మెరకవీధి వినాయకుడి గుడి వెనుక నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కార్యాల యం ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ప్రారంభించారు. సాయంత్రం మూడు గంటలకు నిర్వహించే ఈ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవానికి నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకు లు, కార్యకర్తలంతా హాజరు కావాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులకు నేడు ప్రారంభోత్సవాలు

దేవరపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ శనివారం తెలిపారు. దేవరపల్లి, ధుమంతునిగూడెం, రామన్నపాలెం, బందపురం గ్రామాల్లో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, కమ్యూనిటీ భవనాల ప్రహరీలు, రోడ్లను మంత్రి ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

కోటసత్తెమ్మ ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా హరిసూర్యప్రకాష్



నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా వి.హరిసూర్యప్రకాష్‌ను నియమిస్తూ దేవదాయశాఖ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌గా సూర్యప్రకాష్ ప్రస్తుతం పనిచేస్తున్నారు. శ్రీకోటసత్తెమ్మ ఆలయ ఈఓగా పనిచేస్తున్న బళ్ల నీలకంఠం(శివ)ను సామర్లకోట కుమారభీమేశ్వరస్వామి ఆలయ ఈఓగా బదిలీ చేశారు.

డస్ట్‌బిన్ల పంపిణీ



వేగేశ్వరపురంలో డస్ట్‌బిన్లు అందజేస్తున్న సర్పంచ్

తాళ్లపూడి: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు తడి చెత్త పొడి చెత్తను వేరు చేయడానికి డస్ట్‌బిన్లను ప్రతి ఇంటికీ సర్పంచ్, సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా వేగేశ్వరపురం సచివాలయం వద్ద శనివారం సర్పంచ్ పరశురామారావు, సచివాలయ కార్యదర్శి నాగాం జనేయులు చేతుల మీదుగా డస్ట్ బిన్లను అందజేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోను తడి చెత్త పొడి చెత్తను సేకరించేందుకు డస్టుబిన్లను అందించినట్టు తెలిపారు.

బీరువా అందజేత



పైడిమెట్ట అంగన్‌వాడీ కేంద్రానికి ఐరన్ బీరువా అందజేస్తున్న దృశ్యం

తాళ్లపూడి: తాళ్లపూడి సెక్టార్ పరిధి ప్రక్కిలంక పంచాయతీ పైడిమెట్ట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువులు భద్రపరుచుకునేందుకు ఐరన్ బీరువాను శనివారం నందన ఫౌండేషన్ ప్రతినిధి రవి అందజేశారు. ఈ బీరువాను సెక్టార్ సూపర్ వైజర్ భాగ్య కుమారి సమక్షంలో సిబ్బంది అందించారు. ఈ కార్యక్రమంలో నందన ఫౌండేషన్ సభ్యులు కె.చంద్ర శేఖర్, ఎస్.కె. ఆలి, అంగన్‌వాడీ వర్కర్లు రాజేశ్వరి, పినిశెట్టి శ్యామల ,హెల్పర్ కుమారీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజానికి క్రీడలు దోహదం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ దుర్గాప్రసాద్

నల్లజర్ల: ఆరోగ్యకర సమాజానికి క్రీడలు దోహదపడతాయని నల్లజర్ల సీఐ దుర్గాప్రసాద్ అన్నారు. నల్లజర్లలో సెయింట్ జోసెఫ్, హెరిటేజ్ స్కూలులో మూడు రోజుల పాటు జరిగిన స్పోర్ట్స్ సమ్మిట్‌లో విజేతలకు శనివారం సాయంత్రం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు సైతం భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయన్నారు. స్కూల్ డైరెక్టర్ మేణ్ని జానకిదేవి, జెడ్పీహై స్కూలు పేరెంట్స్ కమిటీ చైర్మన్ నీరుకొండ జయకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహమస్తు..



దేవరపల్లి జగనన్న లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలు

- నెరవేరుతున్న పేదల సొంతింటి కల
- శరవేగంగా జరుగుతున్న నిర్మాణాలు
- 110 లే అవుట్లు, 11,058 ఇళ్ల మంజూరు
- మొదటి విడతలో 7309 గృహాల నిర్మాణం
- మౌలిక సదుపాయాల ఏర్పాటు
- ఆనందపడుతున్న అక్కచెల్లెమ్మలు

దేవరపల్లి: పేదల సొంతింటి కల నెరవేరుతోంది. జగనన్న కాలనీల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణం సాగుతోంది. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల్లో రెండో విడత జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందుకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు కాలనీలను సదర్శించి మౌలిక సదుపాయాలు నీరు, విద్యుత్, రోడ్ల ఏర్పాట్లపై దృష్టిపెట్టారు. మొదటి విడతలో అర్బన్ ప్రాంతంలో ప్రభుత్వం గృహ నిర్మాణం చేపట్టింది. రెండో విడతలో నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో 11,058 గృహాల నిర్మాణానికి ఒప్పుకుంది. 110 లేఅవుట్లలో మొదటి విడతగా 7309 గృహాల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీలను సందర్శించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. గృహనిర్మాణాలు ప్రారంభించడంతో కాలనీల్లో రోడ్లు, మంచి నీరు, విద్యుత్ సదుపాయం కల్పించారు. ఇంటింటికీ పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తున్నారు. దేవరపల్లి, సంగాయగూడెం, దుద్దుకూరు, గౌరీపట్నం, చిన్నాయగూడెం, త్యాజంపూడి, బందపురం, గొల్లగూడెం గ్రామాల్లో గృహనిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. జగనన్న పాలనలో సొంతింటి కల నెరవేతుండడంతో పేద కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంది.

నియోజకవర్గంలో మంజూరైన గృహాల వివరాలు

మండలం	లే అవుట్లు	మంజూరైన గృహాలు
దేవరపల్లి	34	2944
గోపాలపురం	37	1149
నల్లజర్ల	38	2016
ద్వారాతిరుమల	1	1200
మొత్తం	110	7309



దేవరపల్లి మండలం సంగాయగూడెంలో జగనన్న లే అవుట్‌లో శరవేగంగా జరుగుతున్న గృహనిర్మాణాలు

దేవరపల్లిలో తయారవుతున్న ఊరు

జిల్లాలో దేవరపల్లిలో అతిపెద్ద కాలనీ నిర్మాణం జరుగుతోంది. గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారికి ఆనుకుని సుమారు 27 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. సుమారు 1095 మంది పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు పంపిణీ చేశారు.దీనితో గ్రామ శివారున మరొక కొత్త ఊరు తయారవుతుంది. ఇప్పటికే విద్యుత్ సదుపాయం, మంచినీటి సదుపాయం కల్పించారు. లే అవుట్‌లో గల పాత బోర్లకు గ్రామ పంచాయతీ అధికారులు మోటార్లు ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తున్నారు. కొత్తగా మరొక బోరు ప్రభుత్వం మంజూరు చేసింది. మూడు బోర్ల ద్వారా లబ్ధిదారులకు నీరు సరఫరా చేస్తున్నారు. తొలుత 27 ఎకరాలను సేకరించి సుమారు 1095 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాల పట్టాలు పంపిణీ చేశారు. దేవరపల్లి లే అవుట్లలో సుమారు 1400 గృహాల నిర్మిస్తున్నారు. యాదవోలు, కృష్ణంపాలెం, యర్నగూడెం, గ్రామాల్లో సేకరించిన భూమి నివాసాలకు అనుకూలంగా లేకపోవడంతో గృహనిర్మాణాలకు లబ్ధిదారులు నిరాకరిస్తున్నారు. వీటి స్థానంలో వేరొక చోట స్థలాలు ఇవ్వాలని లబ్ధిదారులు ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు.

4749 మందికి ఎంజాయ్మెంట్లు

నియోజకవర్గంలో సొంత స్థలం ఉండి ఇల్లు లేని పేదలను సర్వే చేసి అధికారులు గుర్తించారు. 4749 మంది లబ్ధిదారులను గుర్తించి ఎంజాయ్‌మెంట్ పత్రాలను అందజేశారు. గోపాలపురం నియోజకవర్గం రూడాలో విలీనం చేయడంతో రెండవ విడతలో ప్రభుత్వం గృహాలు మంజూరు చేసింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో 3437 గృహాలు మంజూరు కాగా నిర్మాణలో ఉన్నాయి.

లే అవుట్లలో మౌలిక వసతులు



జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. బోర్లు వేసి మోటార్లు ఏర్పాటు చేస్తున్నాం. నల్లజర్ల మండలం పోతవరంలో రెండు లే అవుట్లలో 350 గృహాలు నిర్మిస్తున్నారు. నియోజకవర్గంలో మూడు మండలాల్లో 109 లేఅవుట్లలో 6109 గృహాలను నిర్మించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో 80 మంది పురుషులు, 6029 మంది మహిళా లబ్ధిదారులు ఉన్నారు. ఎస్సీలు 2293 మంది, ఎస్టీలు 165 మంది, ఓబీసీలు 2365 మంది, జనరల్ కేటగిరి 1286 మంది లబ్ధిదారులు ఉన్నారు. లబ్ధిదారులు గృహనిర్మాణం ప్రారంభిస్తే రూ.20 వేలు అడ్వాన్సుగా చెల్లిస్తాం. ఇసుక ఉచితంగా సరఫరా చేస్తాం. సిమెంట్, ఇనుము ప్రభుత్వ ధరకు సరఫరా చేస్తాం.

– టి. శేఖర్‌బాబు, డీఈఈ, గృహనిర్మాణ శాఖ

అందరికీ న్యాయం



నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అక్కచెల్లెమ్మల కల సాకారమవుతోంది. 7309 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. నియోజకవర్గంలో దేవరపల్లిలో అతిపెద్ద కాలనీ నిర్మాణం చేస్తున్నాం. 27 ఎకరాల్లో 1095 మంది లబ్ధిదారులకు పట్టలు ఇచ్చాం. నియోజకవర్గంలో 20 వేల మందికి ఇల్లు కట్టించడమే నా లక్ష్యం. నియోకవర్గంలో సొంత స్థలాలు ఉండి ఇల్లు లేని కుటుంబాలు సుమారు 6 వేలు ఉన్నాయి. వీరందరికి ఇళ్లు మంజూరుకు కృషి చేస్తున్నాను. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి జగనన్న న్యాయం చేస్తారు.

– తానేటి వనిత, రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి, గోపాలపురం నియోజకవర్గం ఇన్‌చార్జి

జగనన్నకు కృతజ్ఞతలు



20 ఏళ్లుగా అద్దింటిలో ఉంటున్నాం. ఇప్పటికీ నా సొంతిల్లు నెరవేరుతోంది. సీఎం జగనన్న దయతో ఓ ఇంటివారుమవుతున్నాం. ఎంతో ఆనందంగా ఉంది. జగనన్న రుణం తీర్చుకోలేం. ఎంతో మంది పేదల సొంతింటి కల సాకారం అవుతోంది. జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాం. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. పేదలందరం ఆయనకు అండగా ఉంటాం.

– నక్కా వెంకటలక్ష్మి, లబ్ధిదారి, దేవరపల్లి

40 ఏళ్లుగా అద్దె ఇంటిలోనే



మాది సంగాయగూడెం పంచాయతీలోని గాంధీనగరం గ్రామం. 40 ఏళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్నాం. రైతు ఇచ్చిన చిన్న పాటి షెడ్డులో తల దాచుకుని కూలీ చేసుకుని జీవిస్తున్నాం. గతంలో ఎన్నో సార్లు దరఖాస్తు చేసుకున్నాను కానీ రాలేదు. స్థలం కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాం. సొంతింటిపై ఆశలు వదులుకున్నాం.జగనన్న పాలనలో సంగాయగూడెంలో సొంతింటి కల నెరవేరింది. చాలా సంతోషంగా ఉంది. జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– గజ్జవరపు జ్యోతి, గాంధీనగరం

ఇంటి ముంగిటకే సంక్షేమం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- రావివారిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



రావివారిపాలెంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పందలపర్రు గ్రామ శివారు రావివారిపాలెంలో సర్పంచ్ పులుమంతుల నాగదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకుడు రామారావు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు 57 నెలలుగా అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. పందలపర్రు, జీడిగుంట, రావివారిపాలెం గ్రామాల్లో రూ.29.23 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.3.97 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పరిపాలన సాగించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఎన్నుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, గ్రామ అధ్యక్షుడు శ్రీరాములు గంగరాజు, సొసైటీ అధ్యక్షులు శీలంశెట్టి సూర్యనారాయణ, జిల్లా మహిళా సమాఖ్యఅధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, ఉపసర్పంచ్ పినిశెట్టి సత్యనారాయణ, నాయకులు యాళ్ల రామారావు, భోగిరెడ్డి వరప్రసాద్, కాలాబత్తుల సూర్యప్రకాష్, మారిశెట్టి రామకృష్ణ, ఊబా సురేష్, పంచాయతీ కార్యదర్శి కేవీ సుబ్బన్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.16.60 కోట్లతో అభివృద్ధి పనులు

- జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత
- మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ
- మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలు
- అజెండాలో 11 అంశాలపై కౌన్సిల్ తీర్మానం



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: పట్టణంలో ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పించి పట్టణాభివృద్దే ధ్యేయంగా పనులు చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన పట్టణంలోని మున్సిపల్ మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో అజెండాలోని 11 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. ముందుగా చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రోడ్ల విస్తరణ, ఆహ్లాదకరమైన పార్కుల నిర్మాణాలను రూ.16.66 కోట్లతో చేపడుతున్నామన్నారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలకు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కౌన్సిలర్ పువ్వల రతీదేవి మాట్లాడుతూ తన వార్డులో పలు పనులను ఎందుకు నిలిపివేశారో చెప్పాలని అధికారులు నిలదీశారు. ప్రతిపక్ష కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పార్కుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల పేరుతో శిలాఫలకాలు ఏర్పాటుకు రూ.5 లక్షలు సాధారణ నిధుల నుంచి కేటాయించడంపై అభ్యంతర వ్యక్తం చేశారు. దీనికి మున్సిపల్ డీఈఈ మాధవి సమాధానం చెబుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లే శిలాఫలకాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ యలగడ బాలరాజు, గోపిరెడ్డి శ్రీనివాస్‌లు మాట్లాడారు. కౌన్సిల్‌లో అజెండాలో అన్ని అంశాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, మున్సిపల్ డీఈఈ మాధవి, ఏఈ హేమంత్ కుమార్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సీహెచ్ ఉదయ్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిపై అవగాహన అవసరం



బీమా పథకాల బ్రోచర్లను ప్రదర్శిస్తున్న బ్యాంకు అధికారులు

నల్లజర్ల: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని యూనియన్ బ్యాంక్ ఎల్‌డీఎం ప్రసాద్ అన్నారు. శనివారం నల్లజర్లలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌పర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎల్‌డీఎం ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆర్థిక భద్రత, సామాజిక భద్రత రెండు అవసరేమనన్నారు. బ్యాంకుల ద్వారా అందే పథకాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలు ఉన్నత స్థితికి చేరుకునేలా ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజనా, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనా వంటి బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనియణ బ్యాంకు రీజనల్ ఆఫీసు ఎఫ్ఐఎస్ శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజరు నెట్ట శృతి, ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజరు కే లక్ష్మీప్రసన్న, సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ బాబూరావు, జిల్లా కోఆర్డినేటర్ ఎస్.అనిల్, కౌన్సిలర్ బి.చైతన్య, ప్రదీప్, ఎన్.సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

నిడదవోలు: స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు పలు ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులకు సాంకేతిక, పరిశోధనలపై నైపుణ్యంపై ఆసక్తి పెంచేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ప్రిన్సిపల్ జువ్వల నళిని పేర్కొన్నారు.



ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పేదల వైద్యానికి కొండంత భరోసా

- ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు
- పట్టణంలో ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం



కొవ్వూరులో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు: ఏ ఒక్క పేదవాడు వైద్యం కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల చెంతకే వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారని ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో నూతనంగా రూ.2.31 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా మెరుగైన వైద్య సేవలు సైతం గ్రామాల్లోనే అందిస్తున్నారన్నారు.గత టీడీపీ ప్రభుత్వ పాలన కంటే ప్రస్తుతం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. చైర్ పర్సన్ బావన రత్న కుమారి, ఆసుపత్రి వైద్యురాలు టి.సుష్మ మాట్లాడారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, శ్రీరామ సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, కౌన్సిలర్లు మద్దిపట్ల సాయిగీత, బత్తి నాగరాజు, పత్తివాడ నాగమణి, చీరా అరుణకుమారి, నాయకులు గండ్రోతు అంజనీదేవి, దేవగుప్తాపు లక్ష్మణరావు, పోసిన శ్రీకృష్ణదేవరాయులు, చిట్టూరి అన్నవరం, పతివాడ రామారావు, బోడపాటి హనుమంతరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంధం శేష సాయి, కవల నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



విజ్జేశ్వరంలో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: నిడదవోలు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. విజ్జేశ్వరంలో జగనన్న కాలనీకి వెళ్లేందుకు రూ.12 లక్షలతో నిర్మించే గ్రావెల్ రోడ్లు, గోపవరంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, చల్లాలమ్మ అమ్మవారి గుడికి వెళ్లేందుకు రూ.5లక్షలతో నిర్మించే గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రానున్న దృష్ట్యా గ్రామాల్లో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైన్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు తోలేటి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీహరి, నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి కృషి

మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. విజ్జేశ్వరం గ్రామానికి చెందిన 40 మంది మత్స్యకారులకు గోదావరిలో చేపల వేటకు వెళ్లేందుకు లైసెన్స్ ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు శనివారం అందజేశారు.

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాల,బాలికల జట్లు

నల్లజర్ల: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్–16 సబ్ జూనియర్స్ కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమరెడ్డి శ్రీకాంత్ తెలిపారు. శనివారం తణుకు ఆదిత్య కళాశాలలో ఈ ఎంపికలు జరిగాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుంచి దాదాపు 250 మంది పోటీల్లో పాల్గొనగా బాలుర జట్టుకు 12మంది, బాలికల జట్టుకు 12 మందిని ఎంపిక చేసినట్టు చెప్పారు. ఎంపికైన జట్లు ఈనెల 21, 22, 23 తేదీల్లో సత్తెనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సంకు సూర్యనారాయణ, డి.షణ్ముకం, బి.ప్రదీప్, కె.లక్ష్మణ, తాతారావు, ఎస్కే అల్లాభక్షు, జి.శ్రీకాంత్ పర్యవేక్షించారు.

వ్యక్తి అరెస్టు

గోపాలపురం: నందిగూడెంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న వసంతాడ ముక్కయ్యని అరెస్టు చేసి, ఆరు బీర్లు స్వాధీనం చేసుకున్నట్టు గోపాలపురం ఎస్సై కె.సతీష్‌కుమార్ శనివారం తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఉమాదేవి

గోపాలపురం: రాజమహేంద్రవరం సీజీటీఎం పాఠశాలలో ఈనెల 15వ తేదీన నిర్వహించిన ఇన్‌స్పైయిర్ మనక్ జిల్లా స్థాయి పోటీల్లో గోపాలపురం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి శనివారం తెలిపారు. పదో తరగతి విద్యార్థి ఎస్.అనూష తయారు చేసిన ఐబ్లింక్ సెన్సార్ కం యాక్సిడెంట్ కంట్రోల్ చేసిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. ఎం.లిఖిత వైల్డ్ లాండు అర్బన్ ఇంటర్ ఫేసు డిటెక్షన్ ఆఫ్ ఫైర్ అనే అంశంలో గెలుపొందినట్టు తెలిపారు. జిల్లా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఉమాదేవి అభినందించారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

నల్లజర్ల: వచ్చే నెల మూడో తేదీన జరుగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎస్.రాజకుమారి కోరారు. శనివారం నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె సందర్శించారు. నల్లజర్ల, పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య ఉద్యోగులు, ఫార్మాసిస్టులతో పల్స్ పోలియో కార్యక్రమంపై చర్చించారు. ప్రతి గ్రామంలో పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేయాలని, ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మారుమూల గ్రామాలకు, పనులు చేసే ప్రాంతాలకు వెళ్లి పోలియో చుక్కలు వేయాలన్నారు. వ్యాక్సిన్ భద్రపర్చే ఐఎల్ఆర్ (ఐస్‌లైన్ రిఫ్రెరేటర్) డిఫ్రిజ్ పనితీరు పరిశీలించారు. వైద్యాధికారులు తెల్లంగంగాధరరావు, డాక్టరు మహమ్మద్ సిరాజుద్దీన్, డాక్టరు లిఖితపూడి రాజశేఖర్, ఫార్మాసిస్టులు రేవతి, వెంకటేశ్వరావు, పలివెల సత్యం, జీవివి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో బీఎల్‌వోల పాత్ర కీలకం



తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోల సమావేశం

తాళ్లపూడి: ఎన్నికల విధుల్లో బీఎల్‌వోల పాత్ర కీలకమని తహసీల్దార్, ఎన్నికల సహాయ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్‌వోలు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అందరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రఓమంలో ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ఆర్ఐ కిషోర్, సీనియర్ సహాయకులు సీతారామ రాజు, జూనియర్ అసిస్టెంట్ దీపక్, వీఆర్‌వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రేపు నాక్ బృందం పర్యటన

నిడదవోలు: పట్టణంలోని ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో పంజాబ్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వినోద్‌కుమార్ చైర్మన్‌గా నాక్ బృందం పర్యటించనున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. రెండు రోజుల సందర్శనలో భాగంగా అధ్యాపకుల పనితీరు, కళాశాలలో విద్యార్థులకు బోధనా వసతులు, అధ్యాపకుల పరిశోధన, ఐదేళ్లలో వివిధ విభాగాల్లో సాధించిన అభివృద్ధి, విజయాలు, ఉన్నత విద్యా సంస్కరణలు, వివిధ అంశాలను పరిశీలిస్తారని ప్రిన్సిపాల్ జ్యోతి పేర్కొన్నారు.